కంకర క్రషర్లపై కొరడా

ఓవర్‌లోడ్ వాహనాలకు జరిమానా

- ఐదింటి మూసివేతకు ఆదేశాలు
- పర్యావరణ అనుమతులు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక



మాదారంలోని కంకర క్రషర్ ఎదుట ఆందోళన చేస్తున్న యువకులు (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్లపై అధికారులు కొరడా ఝళిపించారు. నిబంధనలు పాటించని క్రషర్‌ల మూసివేతకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. రానున్న రోజుల్లో నిబంధనలను పాటించని క్రషర్లపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు.

జిన్నారం మండల వ్యాప్తంగా 42 కంకర క్రషర్లు ఉన్నాయి. వీటిలో ఖాజీపల్లిలో 20, మాదారంలో 8, సోలక్‌పల్లిలో 8, ఊట్లలో 3, నల్తూర్‌లో 2, కండకచిలో ఒకటి చొప్పున క్రషర్లు ఉన్నాయి. 178హెక్టార్‌ల ప్రభుత్వ భూమిలో ఈ క్రషర్లు విస్తరించి ఉన్నాయి. ఏళ్ల కాలం నుంచి నిబంధనలు పాటించకుండా కంకర క్రషర్ల యజమాన్యాలు క్రషర్లను నిర్వహిస్తున్నారు. నిబంధనలను పాటించకపోవటంతో సమీపంలోని గ్రామాల ప్రజలు తెల్లటి పొగతో కూడిన వాయు కాలుష్యం, బ్లాస్టింగ్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొన్ని రోజులుగా మాదారం గ్రామానికి చెందిన యువకులు క్రషర్లలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే మూసి వేయాలని డిమాండ్ చేస్తూ మైనింగ్, రెవెన్యూ, పోలీసులకు కూడా ఫిర్యాదులు చేశారు.

సాక్షి కథనంతో అధికారుల్లో స్పందన..

కంకర క్రషర్లతో ఎదురవుతున్న ఇబ్బందులపై 'బాబోయ్ పేలుళ్లు' పేరిట సాక్షిలో ఇటీవల ఓ కథనం కూడా ప్రచురితమైంది. దీంతో స్పందించి, పీసీబీ, రెవెన్యూ, టాస్క్‌ఫోర్ అధికారులు ఆయా గ్రామాల్లో ఉన్న కంకర క్రషర్లపై విచారణను ప్రారంభించారు. దీంతో ఖాజీపల్లి పరిధిలోని ఐదు కంకర క్రషర్లకు ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా నిర్వహిస్తుండటంతో వాటిని మూసేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న 79వాహనాలకు రూ.22లక్షల చొప్పున జరిమానా విధించినట్లు అధికారులు వెల్లడించారు. దశలవారీగా కంకర క్రషర్లపై విచారణ జరుపుతూనే ఉంటామని, అన్ని రకాల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

కఠినంగా వ్యవహరిస్తాం

కంకర క్రషర్‌ల యాజమాన్యాలు అన్ని రకాల అనుమతులు తప్పక తీసుకోవాలి. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవు. పర్యావరణ అనుమతులు లేకపోవటంతోనే ఐదు క్రషర్‌ల మూసివేతకు ఆదేశాలు ఇచ్చాం. ఇక నుంచి ఎప్పటికప్పుడు క్రషర్‌ల నిర్వహణపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

– రవీందర్‌రెడ్డి, ఆర్డీఓ, సంగారెడ్డి

కదిలిన రెవెన్యూ అధికారులు

- నక్ష బాట ప్రహరీ కూల్చివేత
- కబ్జాదారులపై కఠిన చర్యలు
- క్రషర్ క్వారీని పరిశీలించిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్



గోడను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

హత్నూర (సంగారెడ్డి): గత 16న 'కబ్జా కోరల్లో లక్షబాట', 19న 'హద్దులు దాటిన తవ్వకాలు' అనే సాక్షి వరస కథనాలకు రెవెన్యూ అధికారులు కదిలారు. తహసీల్దార్ ఫర్హీన్ షేక్ సోమవారం స్పందించి నక్ష బాట కబ్జా ప్రహరీని కూల్చి వేయించారు. మండలంలోని గుండ్ల మాచునూరు సరిహద్దుల్లో ఉన్న క్రషర్ క్వారీ పరిసర ప్రాంతాలను పరిశీలించి విచారణ చేపట్టారు. దౌల్తాబాద్ నుంచి నస్తీపూర్ వెళ్లే నక్షబాట కబ్జాచేసి నిర్మించిన ప్రహరీని గోడను కూల్చి వేయించడం, అదేవిధంగా గుండ్ల మాచునూర్ శివారులో క్రషర్ బ్లాస్టింగ్ల వల్ల రైతుల పొలాల్లో భారీ బండరాళ్లు పడడంపై విచారణ చేపట్టారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములను అక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శీను, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల వెన్నంటి ఉండేది సీఐటీయూనే

రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

పటాన్‌చెరు: కార్మికుల కష్టసుఖాల్లో వెన్నంటి ఉండే సీఐటీయూనే గెలిపించాలని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పెన్నార్ కార్మికులకు పిలుపునిచ్చారు. అంబేద్కర్ భవన్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఇస్నాపూర్ ఎంపీటీసీ సభ్యుడు గడ్డం శ్రీశైలంతో పాటు ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్నార్ పరిశ్రమలో బీఆర్‌టీయూ అధికార గుర్తింపు యూనియన్‌గా ఉండి కూడా ఏ సమస్యను పరిష్కరించలేదని, వేతన ఒప్పందాన్ని మోసం చేసిందని ఆరోపించారు. కార్మికులకు వేధింపులతో పాటు మెమోలు ఎక్కువైనాయని, క్యాంటీన్ రేట్లు పెంచారని వాపోయారు. సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూనే గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు రాజయ్య, పాండు రంగారెడ్డి, నాగేశ్వరరావు, పెన్నార్ పరిశ్రమ నాయకులు శేషగిరి, త్రిమూర్తులు, రాజు, జయకుమార్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతర్ల నిర్వహణతో గ్రామస్తుల ఐకమత్యం

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు



నీలం మధును సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: జాతర్ల నిర్వహణతో గ్రామస్థుల మధ్య ఐకమత్యం వెల్లివిరుస్తోందని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని కర్ధనూర్ గ్రామంలో నిర్వహించిన మల్లన్న స్వామి జాతరలో ఆయన పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. గ్రామాలలో నిర్వహించే జాతరలు ఉత్సవాలతో గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు గ్రామస్థుల మధ్య ఐకమత్యం వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కుమార్, శ్రీనివాస్, శివయ్య, విజయ్, రాజేశ్, రాంప్రసాద్, భూపాల్, దుర్గయ్య, మౌళి, దుర్గ, వీరేశ్, వెంకట్, విక్రమ్, సాయి, జాతర నిర్వాహకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభచూపిన విద్యార్థినులకు సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ

నారాయణఖేడ్: జాతీయ స్థాయి కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు నేతలు ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినులు జాతీయస్థాయి కరాటే అండర్-14 విభాగంలో తమ సత్తా చాటారు. నలుగురు బంగారు పథకాలు, 16 మంది వివిధ పథకాలను సాధించారు. పథకాలను సాధించిన వారిని సోమవారం నారాయణఖేడ్‌లో జెడ్పీటీసీ లక్ష్మీబాయి శాలువాలతో సన్మానించి అభినందించారు. వారిని ప్రోత్సహించిన సిర్గాపూర్ మండలం జమ్లా తండా మాజీ సర్పంచ్ దివ్యభారతిని ఆమె అభినందించారు.

హాల్ టికెట్లకు ఇబ్బందులు పెట్టొద్దు



మాట్లాడుతున్న వెంకటికుమార్

నారాయణఖేడ్: త్వరలో జరగనున్న ఇంటర్మీడియట్, ఎస్ఎస్సీ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నందున హాల్ టిక్కెట్ల విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ వెంకటికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఫీజుల బకాయల పేరిట విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయన్నారు. యాజమాన్యాలు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. అలాంటి యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గాంధీ విగ్రహ ధ్వంసంపై నిరసన

ఆర్యవైశ్యుల ఫిద్యాదు



సీఐకి వినతపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

నారాయణఖేడ్: సిద్దిపేట జిల్లా బక్రీ చెప్యాల్ గ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్యులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నిందితులపై కేసులు నమోదుచేసి ఇలాంటి ఘటనలు మరొకసారి జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ సీఐ శ్రీనివాస్‌రెడ్డికి ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మునిగాల మాణిక్ ప్రభు గుప్తా, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోటగిరి సతీశ్, నారాయణఖేడ్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దారం కృష్ణమూర్తి కోశాధికారి భావుగి నగేశ్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గుజ్జులవార్ సంతోష్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

లింగాయత్ అన్నదాన సత్రం ప్రారంభం



పారంభిస్తున్న పీఠాధిపతులు, సమాజ్ సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన లింగాయత్ నిత్య అన్నదాన సత్రాన్ని ప్రారంభించారు. సోమవారం వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, 108 రాజేశ్వర శివాచార్య స్వామి, వీరేశ్వర శివాచార్య స్వామి, శంభు లింగ శివాచార్య మహారాజ్, ఎం.రాచయ్య స్వామి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, ట్రస్ట్ అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సునీతాపాటిల్, వీర శైవ లింగాయత్ సమాజ్ సభ్యులు మరెల్లి సంగమేశ్వర్, శంకర్ పాటిల్, అప్పారావు, రుద్రప్ప పాటిల్, సంగ్రాం పాటిల్, భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, సిద్దన్న పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ రైల్వే ప్రపంచానికే ఆదర్శం

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



సమావేశంలో పాల్గొన్న గోదావరి తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీయ రైల్వే ప్రపంచానికే ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలోని ఈదుల నాగులపల్లి రైల్వే స్టేషన్ వద్ద అండర్ ప్రాసెస్ బ్రిడ్జిని ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన రైల్వే ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉందన్నారు. మన ప్రాంతంలో నాగులపల్లి రైల్వే అండర్ ప్రాసెస్ బ్రిడ్జి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు. అదేవిధంగా సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్ శంషాబాద్ రాజు, బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

జహీరాబాద్ టౌన్: విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 28న జహీరాబాద్‌లో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి పాల్గొంటారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భారీ జనసమీకరణ..

జహీరాబాద్: జహీరాబాద్‌లో నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్రకు భారీగా జనసమీకరణ చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రాయికోడ్(అందోల్): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–2004 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి రోజులను గుర్తు చేసుకుని ఉత్సాహంగా గడిపారు. వారికి విద్యను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు సంగమేశ్వర్, శ్రీనివాస్, సంగమేశ్వర్ యాదవ్, సత్యనారాయణ, రాజశేఖర్, అమృత్‌రావు, నర్సింగ్‌రావు, రాజ్‌కుమార్, శ్రీనివాస్, వైద్యనాథ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



లాస్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఇటీవల రోడ్డు మాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. సిర్గాపూర్‌కు చెందిన ప్రియాంక అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకుని ఆయన ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులను అడిగి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

విత్తనశుద్ధితో మెరుగైన లాభాలు

వట్‌పల్లి(అందోల్): మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి పాటిస్తే పంటను తెగుళ్ల నుంచి రక్షించుకోవచ్చని సంగుపేట ఏరువాక కేంద్రం విద్యార్థులు సూచించారు. సోమవారం వట్‌పల్లిలో పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. చీడపీడల్ని తట్టుకునే విత్తనాలను సాగుచేసుకోవాలని, అలాగే విత్తన శుద్ధి పాటించడం ద్వారా మంచి దిగుబడితోపాటు లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మోహన్, వికాస్, ఆమాన్, శివ, సంతోష్ పాల్గొన్నారు.

నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి టౌన్: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి సంరక్షణకు గ్రామాలలో చర్యలు తీసుకోవాలని మండల ఏవో ప్రసాద్ పిలుపునిచ్చారు. పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో సోమవారం రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నీటిని ఎలా పొదుపు చేయాలి, వర్షపు నీటిని ఏవిధంగా సంరక్షించుకోవాలనే అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నీటిని తగ్గించుకునే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ సహా వివిధ ఫౌండేషన్ కోర్సుల్లో 5 నెలల శిక్షణలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి టి.అఖిలేష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ పరిధిలోని ఎస్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మార్చి 18నుంచి ఆగస్టు 17వరకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించని వారు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 23 నుంచి మార్చి6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఎంపికైన వారికి ఉచిత హాస్టల్ వసతి ఉంటుదని, పూర్తి వివరాల కోసం 98661 87330, 9849907051 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉత్సాహంగా 'స్వయం పాలన'



న్యాల్‌కల్‌లో.. ఉపాధ్యాయులతో విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని శ్రీవాణి విద్యాలయంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల వేషధారణలో పాఠశాలకు వచ్చి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులుగా వారు అందరినీ అలరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం శివకుమార్, ఉపాధ్యాయులు డి.మహేశ్, కృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యాలత, అరుణజ్యోతి, సోనీ, శివకుమార్, శివలీల, సుమలత, శ్వేత, హంస, కావేరి, పుష్పలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఉసిరికపల్లి పాఠశాలలో..

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఉసిరికపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.నర్సింలు, ఉపాధ్యాయులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు



స్పీకర్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

సంగారెడ్డి: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఓడీఎఫ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు తదితరులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పీకర్ కలిసిన వారిలో సంగారెడ్డి కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కల్వగడ్డ మల్లయ్య, నాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎంపీపీ రవీందర్‌గౌడ్



ఎంపీపీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించే లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నామని, తనను పదవి నుంచి దింపేందుకు ఎవరు ఎన్ని చేసినా న్యాయం తమవైపే ఉంటుందని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. ఎంపీపీపై అవిశ్వాసం వాయిదా పడడంతో సోమవారం ఆయనను పలువురు కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నుంచి వెళ్లిన ఎంపీటీసీ సభ్యులు తనపై అవిశ్వాసం పెట్టేందుకు యతి్నంచారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు లావణ్య, జనాభాయి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పోతులబోగుడా మోడల్ పాఠశాలలోని పది, ఇంటర్ చదివే విద్యార్థులకు సోమవారం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి పి.వినయ్‌గౌడ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజా మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్నారు.

◆ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రమదానం

జోగిపేట(అందోల్): లయన్స్ క్లబ్, ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్తంగా స్వచ్ఛ భారత్ నిర్వహించారు. సోమవారం సాయిలక్ష్మీ ఆసుపత్రి ఆవరణలో శ్రమదానం చేసి చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. డిస్ట్రిక్ట్ లయన్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ అనంతరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ మాట్లాడారు. క్లబ్ జిల్లా చైర్పర్సన్ రాంబాబు, ఉపాధ్యక్షుడు పి.సంతోష్, సభ్యులు పాల్గొన్నారు.

◆ లక్ష్మణ్ యాదవ్‌కు నేతల నివాళులు

జహీరాబాద్ టౌన్: అమరవీరుడు లక్ష్మణ్ యాదవ్ 14వ వర్ధంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. మండలంలోని హోతి(బి) గ్రామంలో లక్ష్మణ్ సమాధి, స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నామ రవి కిరణ్, పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

◆ ఇష్టంతో చదవండి..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని కంకోల్ వోక్సెన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ల బృందం విద్యార్థులకు సూచించింది. వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆ బృందం సభ్యులు సోమవారం సందర్శించారు. రూరల్ డెవలప్మెంట్లో భాగంగా నూతన పద్ధతుల ద్వారా వ్యవసాయం, సోలార్ విద్యుత్, ఆటోమొబైల్ రంగంలో నైపుణ్యాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకట్ రెడ్డి, భార్గవ్, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

◆ తహసీల్దార్‌కు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): స్థానిక తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భిక్షపతితో పాటు ఎంపీడీఓ అరుణకు మాదారం కాంగ్రెస్ నాయకులు సోమవారం సన్మానించారు. మాజీ వార్డు సభ్యుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో అధికారులను సన్మానించారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

◆ హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

నారాయణఖేడ్: గంగాపూర్లో జహీరాబాద్ ఎంపీ నిధులు రూ.2లక్షలతో గ్రామంలోని ప్రధాన కూడలిలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. సోమవారం మాజీ సర్పంచ్ నారాయణ, బీఆర్ఎస్ నాయకులు కుర్మ దత్తు, రాములు, జ్ఞానేశ్వర్ తదితరులు గ్రామస్తులతో కలిసి లైట్లను ప్రారంభించారు.

◆ 85 మందికి వైద్య పరీక్షలు

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని నస్తీపూర్ గ్రామంలో మల్లారెడ్డి వైద్య కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 85 మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ సంఘం అధ్యక్షురాలు సువర్ణ, వీఓఏ ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ 19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం, ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ రైలుపై రాళ్లు విసిరిన ఆకతాయిలు

జహీరాబాద్: రైలుపై రాళ్లు విసిరిన ఇద్దరు ఆకతాయిలను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి బీదర్ వెళుతున్న ఇంటర్‌సిటీ రైలుపై జహీరాబాద్ రేల్వే స్టేషన్ వద్ద ఉన్న ఇద్దరు ఆకతాయిలు రైలుపై రాళ్లు విసిరినట్లు వారు తెలిపారు. రైలులో ప్రయాణీకులు తక్కువగా ఉన్నందున ఎవరికీ గాయాలు కాలేదని, వారిని పట్టుకుని బీదర్ రైల్వే పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

కోహీర్(జహీరాబాద్): ఇస్మా వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం విశ్వేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.